క్లుప్తంగా

మత్తుపదార్థాలతో భవిష్యత్ అంధకారం



మాట్లాడుతున్న ఎక్సైజ్ అధికారి అశోక్‌కుమార్

చొప్పదండి: మత్తుపదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని, డ్రగ్స్ అనర్థాలను తెలుసుకోవాలని కరీంనగర్ రూరల్ ఎక్సైజ్ అధికారి ఎస్.అశోక్‌కుమార్ కోరారు. మండలంలోని రుక్మాపూర్ శివారు కేజీబీవీలో శుక్రవారం మత్తుపదార్థాల అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో మాట్లాడారు. డ్రగ్స్ వినియోగంతో భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. అనంతరం విద్యాలయంలో కాన్సియస్నెస్ క్లబ్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో బాలరక్షక్ కోఆర్డినేటర్ సాయికిరణ్, నషాముక్త్ భారత్ మాలతి, ఉపాధ్యాయులు, సిబ్బంది అశోక్, ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణకు అల్బెండజోల్



మాట్లాడుతున్న డాక్టర్ తులసీదాస్

ఇల్లందకుంట: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం పురస్కరించుకొని వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం అధికారులు మండలస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ తులసీదాస్ అల్బెండజోల్ మాత్రల ప్రాముఖ్యతను వివరించారు. ఒకటి నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా ఈ నెల 10న మాత్రలు వేయాలన్నారు. కార్యక్రమాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించాలని, పదిన మాత్రలు వేసుకోనివారికి 17వ తేదీన మాత్రలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాణి, ఎంపీడీవో పుల్లయ్య, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, అంగన్‌వాడీటీచర్లు, ఆశలు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

భూ నిర్వాసితుల దీక్షకు డీఎస్పీ మద్దతు



దీక్షకు మద్దతు తెలుపుతున్న నరేశ్

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి గ్రామంలో భూనిర్వాసితుల రిలే నిరాహార దీక్ష శుక్రవారంతో మూడో రోజుకు చేరింది. దీక్షకు ధర్మసమాజ్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు తాల్ల నరేశ్ సంఘీభావం తెలిపారు. నిర్వాసితుల న్యాయమైన ఎల్–21 కెనాల్‌ను రద్దు చేయాలని కోరారు. కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్‌ను కలిసి కాల్వ రద్దు చేయాలని వినతిపత్రం సమర్పించగా సానుకూలంగా స్పందించారని నిర్వాసితులు తెలిపారు. శుక్రవారం దీక్షను తాత్కాలికంగా విరమిస్తున్నట్లు తెలిపారు. దీక్షకు సంఘీభావం ప్రకటించినవారిలో డీఎస్పీ నాయకులు అనిల్‌కుమార్, సందీప్, శంకర్‌బాబు, మహేందర్, సిద్దార్థ, రవితేజ, తిరుపతి పాల్గొన్నారు.

సరుకులు అందజేత



సరుకులు అందిస్తున్న దాతలు

గంగాధర: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల అల్పాహారం కోసం హైదరాబాద్‌కు చెందిన పీపుల్స్ ఫౌండేషన్ సంస్థ శుక్రవారం సుమారు రూ.ఆరువేలకుపైగా విలువ చేసే సరుకులను కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాంజనేయులుకు అందజేశారు. ఈసందర్భంగా అధ్యాపకులు, విద్యార్థులు సంస్థ ప్రతినిధులకు కృతజ్ఞతలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గోపాల్, ఇందిర, రాజమహేందర్‌రెడ్డి, రాజు, మహేశ్వర్, రాజు, రాధాకృష్ణ, దీపిక తదితరులు పాల్గొన్నారు.

చెక్కులు పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న నాయకులు

శంకరపట్నం: మండలంలోని కేశవపట్నం గ్రామంలో పలువురికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న బాధితులకు సీఎం సహాయనిధి నుంచి చెక్కులు మంజూరయ్యాయని సీనియర్ నాయకుడు బండారి తిరుపతి తెలిపారు. కార్యక్రమంలో సదానందం, ఇసామొద్దీన్, ఆరీఫ్, ప్రశాంత్, శ్రావణ్, వీరయ్య పాల్గొన్నారు.

టీబీ రహిత సమాజానికి పాటుపడాలి



హుజూరాబాద్: మాట్లాడుతున్న డీటీసీవో రవీందర్‌రెడ్డి



జమ్మికుంట: మాట్లాడుతున్న టీబీ ముక్త్ ఇంపాక్ట్ ఇండియా ప్రతినిధులు

హుజూరాబాద్: టీబీ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని డీటీసీవో రవీందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో టీబీ ముక్త్ గ్రామ పంచాయతీ కార్యక్రమంలో భాగంగా ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శులకు టీబీ రహిత గ్రామపంచాయతీ కాన్సెప్ట్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ... గ్రామాల్లో క్షయవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించడానికి కృషి చేయాలన్నారు. అనంతరం హుజూరాబాద్ డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ చందు మాట్లాడుతూ... జిల్లాను టీబీ రహితంగా తయారు చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో చెల్పూర్ పీహెచ్‌సీ డాక్టర్ మధుకర్, ఎంపీడీవో సునీత, హెచ్ఈవో పంజాల ప్రతాప్, ఎస్టీఎస్ శ్రీనివాస్‌రెడ్డి, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్, డిస్ట్రిక్ట్ లీడ్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

క్షయపై అవగాహన కల్పించాలి

జమ్మికుంట: పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో టీబీ ముక్త్ అభియాన్ కార్యక్రమం పురస్కరించకొని టీబీ ముక్త్ గ్రామ పంచాయతీపై ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో కార్యదర్శులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో క్షయ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, జనరల్ హెల్త్‌స్టాఫ్‌తో కలిసి కొత్త కేసులను గుర్తించి, మందుల వాడకంపై అవగాహన కల్పించి టీబీ రహిత గ్రామాలకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్ట్ ప్రతినిధి ప్రభాకర్, ట్రైనింగ్ మేనేజర్ సురేందర్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, అధికారులు దేవేందర్‌రెడ్డి, కిరణ్, తిరుపతి మండలంలోని కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం



వీణవంక: పూజల్లో పాల్గొన్న భక్తులు



రామడుగు: పూజలు చేస్తున్న ప్రభాకర్‌రావు

నేడు మత్స్యగిరీంద్రస్వామి కల్యాణం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి కల్యాణం శనివారం నిర్వహించనున్నామని ఆలయ చైర్మన్ మల్లారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం స్వామివారి సుప్రభాతం, నిత్యారాధన, నివేదన, బాలభోగం, పుణ్యాహవచనం, విశ్వక్సేనరాధన, అంకురారోహణం, అఖండ దీపారాధన, కులదేవత విగ్రహ ప్రతిష్ఠ నివేదన కార్యక్రమాలు అర్చకులు శేషం మురళీదార్యులు, మాధవాచార్యులు ఘనంగా నిర్వహించారు.

ప్రత్యేక పూజలు

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో నిర్మిస్తున్న శ్రీకనకదుర్గ అమ్మవారి దేవాలయ పనుల్లో భాగంగా శుక్రవారం వేదపండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ క్ష్మీనృసింహస్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రభాకర్‌రావు, వేదపండితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన

వీణవంక: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో సింగిరెడ్డి ధర్మారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో శ్రీ నాగదేవత విగ్రహ ప్రతిష్ఠాపన కన్నుల పండువగా జరిగింది. వ్యవసాయ క్షేత్రంలో నాగదేవత విగ్రహం బయటపడంతో ధర్మారెడ్డి కుమారుడు సత్యనారాయణరెడ్డి దంపతులు గుడి నిర్మించారు. శుక్రవారం వేద పండితులు మంత్రోచ్ఛరణల మధ్య ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగాడి సౌజన్యతిరుపతిరెడ్డి, హరిహరక్షేత్ర ఆలయ చైర్మన్ కొమ్మిడి వెంకట్ రెడ్డి, సింగిరెడ్డి సమ్మిరెడ్డి, ఉయ్యాల చంద్రమౌళి , పోతరవేన తిరుపతి, రాచర్ల సుధాకర్, కాసనగట్టు కరుణాకర్, గిరవేన సమ్మయ్య ఉన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామ శ్రీగణపతి, శ్రీపార్వతి సమేత శ్రీమహాలింగేశ్వరస్వామి ఆలయ ప్రథమ వార్షిక మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా జరిగింది. అర్చకులు రాజుశర్మ, మధుసూదనాచార్యులు, మురళీకృష్ణమాచార్యుల వేదమంత్రోచ్ఛరణల మధ్య శ్రీగణపతి పూజ, అష్టోత్తర శతఘటాభిషేకంతో పాటు సామూహిక శ్రీమహాగణపతి శ్రీరుద్ర మూల మంత్ర హోమం, అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. గతేడాది భక్తుల విరాళాలతో ఆలయం నిర్మించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



ముస్తాబైన మత్స్యగిరీంద్రస్వామి ఆలయం

రమాబాయి అంబేడ్కర్ జయంతి



రమాబాయి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

హుజూరాబాద్: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేడ్కర్ సతీమణి రమాబాయి అంబేడ్కర్ జయంతి శుక్రవారం అంబేడ్కర్ జయంతోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమాబాయి చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి కమిటీ చైర్మన్ ఖాలిక్ హుస్సేన్, పూలే జయంతి కమిటీ చైర్మన్ ఉప్పు శ్రీనివాస్, స్వామి రెడ్డి, సొల్లు బాబు, సునీత, వేల్పుల రత్నం, విష్ణుదాస్ గోపాలరావు, తులసి లక్ష్మణామూర్తి, డాక్టర్ తడికమల్ల శేఖర్, పాక సతీశ్, మట్టెల తిరుపతి, వేల్పుల ప్రభాకర్, బొడ్డు ఐలయ్య, మోరే సతీశ్, రామ్ రాజేశ్వర్, ఇల్లందుల సమ్మయ్య, దాట్ల ప్రభాకర్, మేకల మొగిలి, కింసారపు తిరుపతి, మంద రాజు పాల్గొన్నారు.

విద్యార్థుల చదువుకు అండగా

గంగాధర: మండలంలోని వెంకంపల్లి గ్రామానికి చెందిన శరణ్య, పత్తికుంటపల్లి గ్రామానికి చెందిన కీర్తనల చదువు కోసం ఫీజు చెల్లిస్తూ యూత్ కాంగ్రెస్ చొప్పదండి నియోజకవర్గ అధ్యక్షుడు వొడ్నాల యగ్నేశ్ అండగా నిలుస్తున్నాడు. ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి శుక్రవారం రూ.44 వేలు ఫీజు చెల్లించాడు. పట్టుదలతో చదివి ఉన్నత స్థాయిలో రాణించాలని విద్యార్థులకు సూచించాడు.

విద్యార్థి సంఘాల నాయకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నాయకులు

జమ్మికుంట: పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన చేపట్టారు. పట్టణంలోని ఓ పాఠశాలలో చదువుతున్న ఆరోతరగతి విద్యార్థి నుంచి అధిక ఫీజు వసూలు చేశారని బంధువుల ఫిర్యాదు మేరకు స్కూల్ యాజమాన్యాన్ని అడిగితే దురుసుగా ప్రవర్తించారని ఆరోపిస్తూ అందోళనకు దిగారు. స్కూల్ యాజమాన్యం పోలీసులకు సమాచారం అందించగా విద్యార్థి సంఘాల నాయకులను ఆదుపులోకి తీసుకున్నారు. పోలీసులు పాఠశాల యాజమాన్యం , విద్యార్థి సంఘాల నాయకులతో చర్చించి అధిక ఫీజు తిరిగి ఇప్పించడంతో సమస్య సద్దుమణిగింది. పట్టణంలోని పాఠశాలలు అధిక ఫీజు వసూలు చేస్తే పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు గట్టు సాయిరామ్, పసునూటి శివకుమార్, పాతకాల ప్రవీణ్, గంగారపు మహేష్, అమ్మ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మృతి

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపల్లికి చెందిన యువకుడు సూర్యకిరణ్(30) చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. సూర్యకిరణ్ కొద్దిరోజులుగా ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడు, ఆ అమ్మాయి ప్రేమించడం లేదని చెప్పడంతో మనస్తాపానికి గురై గురువారం పురుగుమందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ తిరుమల్‌గౌడ్ తెలిపారు.

జమ్మికుంట: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందాడు. టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన పానగంటి రమేశ్(42) కుటుంబంలో ఉమ్మడి ఆస్తుల విషయంలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. మనస్తాపానికి గురై న రమేశ్ జనవరి 29వ తేదీన పురుగు మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడి భార్య స్రుజన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు టౌన్ సీఐ రవి తెలిపారు.

మడిపల్లి గ్రామానికి చెందిన...

భార్య మృతితో మనస్తాపానికి గురైన వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. టౌన్ సీఐ వరంగంటి రవి తెలిపిన వివరాలు.. మండలంలోని మడిపల్లి గ్రా మానికి చెందిన గుండెకార రాజేందర్ (53) గురువారం పురుగు మందు సేవించాడు. ఇంటి చుట్టు పక్కల వారు చికిత్స నిమిత్తం జమ్మికుంటలోని ఓ ప్రైవేటు ఆసపత్రికి తరలించి హైదరాబాద్‌లోని కుమారుడికి సమాచారం అందించారు. మృతుడి భార్య లక్ష్మి మూడు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె మృతితో మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడని వివరించారు. మృతుడి కుమారుడు శరత్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

బాలల పరిరక్షణ కమిటీ సమావేశం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం బాలల పరిరక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల మాట్లాడుతూ తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్యంలోనే వివాహాలు చేయడం చట్టవిరుద్ధమన్నారు. బడి మానేసిన పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. మహిళా సాధికారిత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ శైలజ మాట్లాడుతూ ఎదుగుతున్న పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా గమనించాలని అన్నారు. పిల్లలు సెల్‌ఫోన్ ఎక్కువగా ఉపయోగించకుండా తగిన కట్టడి చేయాలని సూచించారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు సఖీ కేంద్రం పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రత్యేక అధికారి బి.సత్యం, అంగన్‌వాడీ టీచర్ సువర్ణ, ఆశా కార్యకర్తలు పద్మ, లక్ష్మీతో పాటు పలువురు తల్లులు పాల్గొన్నారు.

డీఎస్పీ ఉద్యోగాన్ని వదిలి ప్రజాక్షేత్రంలోకి వచ్చా

కరీంనగర్: నిరుద్యోగ యువత కోసం పట్టభద్రుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఉన్నతమైన డీఎస్పీ ఉద్యోగాన్ని వదిలి ప్రజాక్షేత్రంలోకి వచ్చానని, ఒక్కసారి ఆలోచించి పట్టభద్రుల ఎమ్మెల్సీగా తనను గెలిపించాలని మదనం గంగాధర్ అన్నారు. శుక్రవారం కోర్టు చౌరస్తాలోని ఓ కల్యాణ మండపంలో పట్టభద్రులతో సమావేశం ఏర్పాటు చేసి రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నగరంలో భారీ ర్యాలీగా కలెక్టరేట్ వరకు చేరుకొని నామినేషన్ దాఖలు చేశారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ యువతను విస్మరించడం రాజకీయ పార్టీలకు రివాజుగా మారిందని, యువతను విస్మరించిన అన్ని పార్టీలకు ఈ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని అన్నారు. శాసనమండలిలో నిరుద్యోగుల పక్షాన వాణి వినిపించి యువతకు, పట్టభద్రులకు అండగా నిలుస్తానని అన్నారు. అంతకు ముందు రిటైర్డు ప్రిన్సిపాల్ మోతె శివశంకర్‌తో పాటు తదితరులు మదనం గంగాధర్‌కు రూ.లక్ష వరకు ఆర్థిక సాయం అందజేశారు.



వీణవంక:మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలోని మొక్కలకు పంచాయతీ సిబ్బంది నీరు పట్టకపోవడంతో ఎండిపోతున్నాయి. రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన పల్లెప్రకృతి కార్యక్రమం పంచాయతీ సిబ్బంది నిర్లక్ష్యంతో నీరుగారుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
హరీశ్, పంచాయతీ కార్యదర్శి, బ్రాహ్మణపల్లి, సెల్‌నం: 9491951762

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

నేడు విద్యుత్ సరఫరా బంద్

హుజూరాబాద్: పట్టణంలో 33కేవీ హుజూరాబాద్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్ ఏఈ ఎం. శ్రీనివాస్‌గౌడ్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. హుజూరాబాద్ పట్టణం, బోర్నపల్లి, కొత్తపల్లి, తుమ్మనపల్లి ప్రజలు సహకరించాలని కోరారు.

మానకొండూర్: మండలంలోని చెంజర్ల, కొండపలకల 33 / 11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని ఏఈ జి.లక్ష్మణామూర్తి తెలిపారు. మరమ్మతుల దృష్ట్యా ఉదయం 10 గంటల నుంచి 11:30 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని వి ద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

వీణవంక: మండలంలోని బేతిగల్, పోతిరెడ్డిపల్లి గ్రామాల్లోని 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈ సురేశ్ తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంటవరకు కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని వినియోగదారులు గమనించాలని కోరారు.

పరిహారం మంజూరు చేయించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

గంగాధర: మనోహరాబాద్–కొత్తపల్లి రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రంగరావుపల్లి నిర్వాసితులకు వెంటనే పరిహారం మంజూరు చేయించాలని కోరుతూ శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని గర్షకుర్తి, ఉప్పరమల్యాల రెవెన్యూ గ్రామాల పరిధిలో రైల్వేలైన్ నిర్మాణం కోసం ప్రభుత్వం భూసేకరణ చేపట్టగా రైతులు అంగీకారం తెలిపి సంతకాలు చేశారు. ఐదేళ్లు గడుస్తున్నా పరిహారం మంజూరు కావడం లేదని రైతులు వాపోతున్నారు. ఒకవైపు భూముల ధరలు పెరుగుతున్నాయని ప్రభుత్వం ఎకరాకు ఇచ్చే పరిహారంతో అర ఎకరం వస్తుందో లేదోనని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం చెల్లించాలని మాజీ ఎంపీటీసీ ద్యావ మధుసూదన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

బీమా చట్ట సవరణ బిల్లు తిరస్కరించాలి



అవగాహన కల్పిస్తున్న బొంకూరి కుమారస్వామి, తదితరులు

హుజూరాబాద్: కేంద్ర ప్రభుత్వం తీసుకువస్తున్న 2024 బీమా చట్ట సవరణ బిల్లును ప్రతి ఒక్కరూ తిరస్కరించాలని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) హుజూరాబాద్ బ్రాంచ్ అధ్యక్షుడు బొంకూరి కుమార్ స్వామి కోరారు. బిల్లును వ్యతిరేకిస్తూ శుక్రవారం పట్టణంలోని ప్రజలకు అవగాహన కల్పించారు. చట్ట సవరణ బిల్లు ద్వారా వచ్చే ఇబ్బందులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం కుమార్‌స్వామి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం బీమా సవరణ బిల్లు ప్రవేశపెట్టనుందని, పాలసీదారులు, సాధారణ పౌరులకు, ప్రభుత్వ రంగ బీమా పరిశ్రమ ప్రయోజనాలకు విఘాతం కలిగించే అనాలోచిత బీమా చట్ట సవరణలను పోరాటాల ద్వారా ప్రతిఘటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఐఈఏ బ్రాంచ్ కార్యదర్శి ఆకుల చందర్, పి. శ్రీనివాస్, రచిత్ రెడ్డి, అంజలి, ఆర్ కుమారస్వామి, ఏం. ప్రేమకుమార్, ఎల్ఐసి ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం పీఆర్‌టీయూతోనే సాధ్యం

కరీంనగర్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో పీఆర్‌టీయూ అగ్రభాగాన ఉందని, పీఆర్‌టీయూ అభ్యర్థిగా టీచర్ ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న వంగ మహేందర్‌రెడ్డిని మొదటి ప్రాధాన్యత ఓటుతో గెలిపించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పద్మనాయక కల్యాణ మండపంలో జరిగిన ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల నాయకులతో జరిగిన సమావేశంలో మాట్లాడారు. గెలిచిన ఆరు నెలల లోపు ప్రభుత్వం సీపీఎస్ రద్దు చేస్తూ ఓపీఎస్ అమలు చేయకలేకపోతే ఇద్దరు ఎమ్మెల్సీలతో ఆమరణ నిరాహార దీక్ష చేయిస్తానని, పెండింగ్ బిల్స్‌పై ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మాజీ కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మోహన్ రెడ్డి మాట్లాడుతూ ఆరు పీఆర్సీలలో ఉద్యోగ, ఉపాధ్యాయులకు మెరుగైన పీఆర్సీ ఇప్పించి, వందల జీవోలు ఉపాధ్యాయుల ఒడిలో పోసిన సంఘం పీఆర్టీయూ అని అన్నారు. పీఆర్‌టీయూ కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వంగ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ నన్ను గెలిపిస్తే ఏ రాజకీయ పార్టీ కండువా కప్పుకోనని ఉపాధ్యాయుల సమస్యల కొరకు పోట్లాడుతానని కౌన్సిల్ సాక్షిగా మీ గొంతుకనవుతానని తెలిపారు. 33 జిల్లాల పీఆర్‌టీయూ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు, 17 సోదర సంఘ రాష్ట్ర, జిల్లా, మండల బాధ్యులు పాల్గొన్నారు.